
నేడు జిల్లా సమీక్ష సమావేశం: ఇన్‌చార్జి కలెక్టర్

విజయనగరం కలెక్టరేట్, మే 11(ఆంధ్రజ్యోతి): జిల్లా సమీక్ష సమావేశం సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రారంభంకానుందని ఇన్‌చార్జి కలెక్టర్ సేతుమాధవన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హోంశాఖ మంత్రి, ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన జరిగే సమావేశానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లా అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై సమీక్ష ఉంటుందని తెలిపారు.



ప్రైవేటు భవనంలోనే గిరిజన వర్సిటీ


జూట్ పరిశ్రమ


ఎన్‌సీఎస్ సుగర్స్


మెరుగుపడని రోడ్డు


పనులకు కదలిక లేని తారకరామ

ప్రగతి పట్టాలెక్కేనా?

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాది అవుతోంది. ఇంకా పూర్తిస్థాయిలో అభివృద్ధి పనులు పట్టాలెక్కలేదు. సంక్షేమ పథకాలూ అరకొరే. సాగుకు కీలకంగా ఉన్న ప్రాజెక్టుల పనులూ సాగడం లేదు. జూట్, ఫెర్రో పరిశ్రమలు అయోమయంలోనే ఉన్నాయి. చాలా ప్రాంతాలకు రహదారుల నిర్మాణం కొలిక్కి రాలేదు. ఈ పరిస్థితిలో సోమవారం జరుగనున్న జిల్లా సమీక్ష సమావేశంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఇక్కడి పరిస్థితులు, అవసరాలు, అభివృద్ధిపై ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి. సమావేశానికి ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షత వహించనున్నారు.


- ఇంకా తెరుచుకోని పరిశ్రమలు
- మెరుగుపడని రహదారులు
- నత్తనడకన అభివృద్ధి పనులు
- నేడు జిల్లా సమీక్ష సమావేశం
- హాజరుకానున్న ఇన్‌చార్జి మంత్రి అనిత

విజయనగరం/ కలెక్టరేట్, మే 11 (ఆంధ్రజ్యోతి):
జిల్లాలో జూట్, ఫెర్రో అల్లాయిస్, చక్కెర పరిశ్రమలు ఆరేళ్ల కిందట ఓ వెలుగు వెలిగాయి. గత పాలకుల తీరుతో సంక్షోభంలో పడ్డాయి. తొలుత జూట్ పరిశ్రమలు, తరువాత చక్కెర కర్మాగారాలు, అటు తరువాత ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలు మూతపడ్డాయి. వేలాది మంది కార్మికులు వీధినపడ్డారు. పరోక్షంగా అంతకుమించిన సంఖ్యలో నష్టపోయారు. ఇందులో జనపనార, చక్కెర కర్మాగారాలు వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు. వీటిపై ఆధారపడిన కార్మికులు వేలాది మందికి ఉపాధి దూరమైంది. లక్షలాది మంది రైతులకు సైతం ఇబ్బందికరంగా మారింది.

● రెండు దశాబ్దాల కిందట ఉమ్మడి విజయనగరం జిల్లాలో గోగు 1.08 లక్షల ఎకరాల వరకూ సాగయ్యేది. పుష్కరకాలం కిందట 30 వేల ఎకరాలకు పడిపోయింది. ఇప్పుడు పూర్తిగా పంట కనుమరుగైంది. ఉమ్మడి జిల్లాలో బొబ్బిలి, రాజాం, సాలూరు ప్రాంతాల్లో 20 వరకూ పరిశ్రమలు మూతపడ్డాయి. అటు రైతులు పంట పండించడం లేదు.

● ఫెర్రో పరిశ్రమలదీ అదే తీరు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 17 ఉండేవి. అందులో సగం మూతపడ్డాయి. మరికొన్ని ఉత్తరాది రాష్ట్రాలకు తరలిపోయేందుకు సిద్ధంగా ఉన్నాయి.

● జిల్లాలో రెండు చక్కెర పరిశ్రమలు సహకార రంగంలో నడిచేవి. సీతానగరం ఎన్‌సీఎస్ ప్రైవేటుపరం అయ్యింది. వాటి ఆస్తుల విక్రయం కూడా జరిగిపోయింది. పూర్తిగా పరిశ్రమ (మిగతా 8వ పేజీలో..)



బాబోయ్ ఎండలు


దగ్ధమవుతున్న ట్రాక్టర్


ఎండకు తాళలేక..

శృంగవరపుకోట రూరల్/ గరివిడి, మే 11(ఆంధ్రజ్యోతి): భానుడి భగభగలకు ఈ చిత్రాలు నిలువెత్తు సాక్ష్యాలు. ఎస్.కోట మండలం పోతనాపల్లి గ్రామంలో ఒక ట్రాక్టర్ ఇంజన్‌లో ఆదివారం అకస్మాత్తుగా మంటలు పుట్టాయి. పొట్నూరు శివ తన ట్రాక్టర్‌ను ఇటుకల బట్టీ వద్ద పెట్టి పని మీద బయటకు వెళ్లాడు. ఉదయం 11గంటల సమయంలో తీవ్రమైన ఎండవేడికి ఇంజన్ నుంచి మంట పుట్టింది. స్థానికులు గమనించి నీళ్లు పోసినా అదుపులోకి రాలేదు. ఇంజన్ పేలుతుందన్న భయంతో దూరంగా వెళ్లిపోయి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. వారొచ్చి మంటలను ఆపినప్పటికీ అప్పటికే ఇంజన్ పూర్తిగా కాలిపోయింది.

● గరివిడి - చీపురుపల్లి ప్రధాన రహదారిలో ఓ చిరు వ్యాపారి ఆదివారం ద్విచక్రవాహనంపై వెళ్తూ తలపై వేపకొమ్మలను పెట్టుకుని 'ఆంధ్రజ్యోతి' కెమెరా కంట పడ్డారు. ఎండ తీవ్రతను తలపాగా అడ్డుకోలేకపోతోందని, కొమ్మలైతే కాస్త ఊరట ఉందని చెప్పాడు.

సర్వం.. సిద్ధం

- నేడు పైడిమాంబ దేవర ఉత్సవం
- విద్యుత్ వెలుగుల్లో పైడిమాంబ ఆలయం



విజయనగరం రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి):
పైడిమాంబ దేవర ఉత్సవానికి మూడులాంతర్ల వద్దనున్న చదురుగుడి సిద్ధమైంది. ఏటా వైశాఖమాసంలో నిర్వహించే ఈ ఉత్సవానికి ఎంతో ప్రాధాన్యం ఉంది. అక్టోబరులో జరిగే సిరిమానోత్సవానికి దేవర ఉత్సవం నాంది. పైడిమాంబను వనంగుడి నుంచి చదురుగుడికి తీసుకురావడమే ఈ ఉత్సవం ప్రధాన ఉద్దేశం. ఇందుకు సంబంధించి ఏర్పాట్లు పూర్తయ్యాయి. చదురుగుడికి రంగు, రంగుల విద్యుత్ దీపాలు అలంకరించారు. ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఎండ ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పైడిమాంబ ఆలయానికి ఇరువైపులా టెంట్లు వేశారు. స్వాగత ద్వారం, పైడిమాంబ ఆలయం వెలుపల, లోపల విద్యుత్ దీపాలు అలంకరించారు. పైడిమాంబ భక్తుల ఆధ్వర్యంలో ఉచితంగా మజ్జిగ పంపిణీ ఏర్పాటు చేస్తున్నారు. దేవర ఉత్సవం సోమవారం సాయంత్రం 5 గంటలకు రైల్వేస్టేషన్ వద్దనున్న వనంగుడి నుంచి ప్రారంభమౌతుంది. హుకుంపేట నుంచి రాత్రి ఘటాల ఊరేగింపు అనంతరం పెద్ద చెరువు ప్రాంతం నుంచి పైడిమాంబను తీసుకువస్తారు. వన్‌టౌన్, టూటౌన్ పోలీసు స్టేషన్ల సీఐలు, ఎస్‌ఐలు, ఇతర పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. దేవదాయశాఖ దేవర ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించనుంది.

తెలంగాణ ఈఏపీ సెట్‌లో కార్తీక్‌కు మూడో ర్యాంకు



విజయనగరం కలక్టరేట్, మే 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఈఏపీ సెట్ ఇంజనీరింగ్ ఫలితాల్లో విజయనగరం జిల్లాకు చెందిన బి.హేమసాయి సూర్యకార్తీక్ మూడోర్యాంకు సాధించారు. విజయనగరంలోని అయ్యన్నపేటకు చెందిన కార్తీక్ జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియాలో 75 ర్యాంకు సాధించారు. ఈయన విజయవాడలో ఇంటర్ పూర్తి చేయగా 988 మార్కులు వచ్చాయి. పదో తరగతిలో 592 మార్కులు వచ్చాయి. ఐఐటీలో సీటు సాధించాలనే లక్ష్యంతో ఉన్నట్లు కార్తీక్ వెల్లడించారు. తండ్రి జగన్మోహనరావు విజయనగరంలోనే చైతన్య డిగ్రీ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు.


సీజ్ చేసిన వాహనాలను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

నగరంలో కార్డన్ సెర్చ్

- ఆకస్మికంగా ఇళ్లల్లో సోదాలు నిర్వహించిన పోలీసులు
- రికార్డులు సరిగా లేని 75 వాహనాలు సీజ్

విజయనగరం క్రైం, మే 11 (ఆంధ్రజ్యోతి): అది తెల్లవారుజాము సమయం. ఇంకా ఎవరూ మేల్కో లేదు. ఆకస్మికంగా పోలీస్‌వాహనం సైరన్ మోగిస్తూ వచ్చి ఆ ప్రాంతంలో అలజడి సృష్టించింది. ఆ శబ్దానికి మేల్కొన్న ప్రజలు ఏం జరిగిందో తెలుసుకునేందుకు తలుపు తీయగా ఆ వెంటనే పోలీసులు ఏకంగా ఇళ్లల్లోకి వచ్చి సోదాలు చేయడం ప్రారంభించారు. వారు కోలుకోకముందే నేరాలపై ఆరా తీశారు. అదే సమయంలో రోడ్డుపై వెళ్లే వాహనదారులను కూడా అడ్డుకుని రికార్డులు తనిఖీ చేశారు. కొన్ని వాహనాలను సీజ్ చేశారు. హడావిడి చూస్తున్న స్థానికులకు ఏం అర్థం కాలేదు. గంట తర్వాత పోలీసులు అసలు విషయం చెప్పారు. ఇదంతా కార్డన్ సెర్చ్‌లో భాగమని, ఈ ప్రాంతంలో నేరస్థులు ఉన్నట్లు తమకు సమాచారం వచ్చిందని, వారిని పట్టుకునేందుకే ఈ తనిఖీలు చేపట్టామన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా నేరాలు, అక్రమ రవాణా నియంత్రణలో భాగంగా జిల్లా కేంద్రంలోని టూటౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని వైఎస్సార్ నగర్‌లో అదివారం తెల్లవారుజామున ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాలతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇళ్లల్లో ఆకస్మిక సోదాలు నిర్వహించి కొత్త వ్యక్తులపై ఆరాతీశారు. విజయనగరం డీఎస్పీ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 12 మంది సీఐలు, 32 మంది ఎస్‌ఐలతో పాటు 400 పోలీసు సిబ్బంది ఈ తనిఖీల్లో పాల్గొన్నారు. ఆయా వ్యక్తుల వివరాలు సేకరించి వారి వేలి ముద్రలను ఎంఎస్‌సీడీ పరికరాలతో పోల్చి చూశారు. రికార్డులు సక్రమంగా లేని 75 ద్విచక్ర వాహనాలను టూటౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ, ప్రజల రక్షణ, భద్రతకు భరోసా కల్పించాలన్న లక్ష్యంతోనే కార్డన్‌సెర్చ్ చేపట్టామన్నారు. అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి 25 సెల్‌ఫోన్‌లు, మూడు లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు.

కలపపై కన్నేశారు

- జిల్లాలో యథేచ్ఛగా అక్రమ రవాణా
- టేకు, నీలగిరి, సరుగుడు చెట్లు తరలింపు
- చోద్యం చూస్తున్న యంత్రాంగం

● ఎస్.కోట మండలంలోని తాటిపూడి, కృష్ణాపురం రహదారుల్లో రాత్రీపగలు తేడా లేకుండా సరుగుడు, గంధ్ర, టేకు, పాచి తదితర రకాల చెట్లు ఎక్కువగా రవాణా అవుతున్నాయి. ఇవి ఎస్.కోట, జామి మండలాల్లో ఉన్న షామిల్లులకు అధికంగా తరలిపోతున్నాయి. అరికట్టాల్సిన అటవీశాఖ పెద్దగా దృష్టిసారించడంలేదనే విమర్శలున్నాయి.

● మెంటాడ, గజపతినగరం మండలాల నుంచి రాత్రి వేళ కలప అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. ఒక సర్వే నెంబరు మీద కటింగ్ అర్డర్ తీసుకుని ఇతర చోట్ల కలపను కట్ చేసి తరలిస్తున్నారు. రాత్రి వేళ అధికంగా రవాణా చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు దృష్టి సారించటం లేదనే విమర్శలున్నాయి. ఈ మధ్యకాలంలో షామిల్లులపై కనీస స్థాయిలో తనిఖీలు లేవు. దీనిని అక్రమ రవాణాదారులు ఓ అవకాశంగా తీసుకుంటున్నారు.

విజయనగరం, మే 11(ఆంధ్రజ్యోతి):
దొరికితే దొంగ.. దొరక్కుంటే దొర అన్నట్టుంది కలప అక్రమ రవాణాదారుల తీరు. జిల్లాలో కలప వ్యాపారం మూడు పువ్వులు, ఆరు కాయలుగా కొనసాగుతోంది. అక్కడా ఇక్కడా అన్న తేడా లేకుండా అన్నిచోట్ల కలప అక్రమ రవాణా జరుగుతోంది. బహిరంగ మార్కెట్‌లో కలపకు విపరీతంగా డిమాండ్ పెరిగింది. గృహోపకరణాలకు కలపను విరివిగా వినియోగిస్తున్నారు. దీంతో అక్రమార్కుల కన్ను కలపపై పడింది. ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో గుట్టుగా కలపను నరికివేస్తున్నారు. రెండో కంటికి తెలియకుండా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఏపుగా పెరిగిన భారీ వృక్షాలనే టార్గెట్ చేస్తున్నారు. ఇందుకు రాత్రివేళల్లో అధునాతన యంత్రాలను వినియోగిస్తున్నారు. తెల్లవారేసరికి ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు. కోట్ల రూపాయల్లో వ్యాపారాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. అటవీశాఖ అధికారులు మాత్రం నిఘా పెడుతున్నామని చెబుతున్నారు కానీ గ్రామీణ, అటవీ ప్రాంతాల నుంచి కలప మాయం అవుతూనే ఉంది.

అక్కడ కలప కోత అధికం

ముఖ్యంగా ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గంలోని అటవీ ప్రాంతాల్లో కలప కోత అధికంగా ఉంది. రాజాం నియోజకవర్గంలో సైతం కలప అక్రమ రవాణా జరుగుతోంది. ముఖ్యంగా టేకు కర్రలను ఎక్కువగా తరలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కలప కోత యంత్రాలు, టింబర్ డిపోలు అధికంగా ఉన్నాయి. వీటిపై అధికారుల నిఘా కొరవడింది. చాలాచోట్ల (మిగతా 8వ పేజీలో..)


జామి మండలం తాండ్రంగి వద్ద అక్రమంగా నరికిన కలప



నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

హాజరుకానున్న 21,847 మంది విద్యార్థులు

విజయనగరం కలెక్టరేట్ మే 11 (ఆంధ్రజ్యోతి):
ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్ టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా మొదటి, ద్వితీయ సంవత్సరం కలిసి 21,847 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. ఈనెల 12 నుంచి 20వ తేదీ వరకూ ఈ పరీక్షలు జరగనున్నాయి. మొదటి సంవత్సర విద్యార్థులకు ఉదయం 8.30 నుంచి 12 గంటల వరకూ రెండో సంవత్సర విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు జరగనున్నాయి. మొదటి సంవత్సరంలో 15,659 మంది, రెండో సంవత్సరంలో 6,188 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. ఫస్టియర్ కోసం 52 కేంద్రాలు, సెకెండియర్ కోసం 26 పరీక్ష (మిగతా 8వ పేజీలో..)

8.45 దాటితే కేంద్రాల్లోకి అనుమతి లేదు

పరీక్షలకు హాజరు కానున్న విద్యార్థులు తప్పకుండా ఉదయం 8.30 నుంచి 8.45 మధ్య హాజరు కావాలి. సమయం దాటితే కేంద్రంలోకి అనుమతించేది లేదు. ఈ విషయాన్ని ప్రతి విద్యార్థి గమనించాలి. అన్ని కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాం. మాల్‌ప్రాక్టీసు జరగకుండా పక్కాగా నిఘా పెడతాం. ప్రతి కేంద్రంలో 144 సెక్షన్ అమలులో ఉంటుంది.

- శివ్వాల తవిటినాయుడు,
జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

న్యూస్ బాక్స్

రేపు మండల సర్వసభ్య సమావేశం

రాజాం, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాయంలో ఎంపీపీ లావేటి సులోచన అధ్యక్షతన ఈనెల 13న మండల సర్వసభ్య సమావేశం నిర్వహిచనున్నారు. ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నెల్లిమర్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): సతివాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్ నిర్వహణ పనులు, చెట్ల తొలగింపు కారణంగా ఈ నెల 12న వివిధ గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఆ శాఖ విజయనగరం టౌన్ డివిజన్ ఈఈ పి.త్రినాథరావు ఒక ప్రకటనలో తెలిపారు. మదుపాడ, పినతరిమి, పెదతరిమి, బొప్పడాం, వల్లూరు, బుచ్చన్నపేట, బొడ్డపేట, ఒమ్మి, మల్యాడ, వెంకన్నపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

దత్తజ్ఞానబోధ సభ...

రేగిడి, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక దత్తమందిరంలో సోమవారం దత్తజ్ఞాన బోధ సభ నిర్వహిస్తున్నట్ల దత్తపీఠ కన్వీనర్ రుంకు శ్రీనివాస మాస్టర్ తెలిపారు. పీఠం అధ్యక్షులు కిమిడి సూరపనాయుడు, రవిశంకర్‌ల ఆధ్వర్యంలో జరుగుతున్న సమావేశానికి భక్తులు హాజరుకావాలని ఒక ప్రకటనలో కోరారు.

విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలి

రాజాం రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలపై పెనుభారం పడేలా యాక్సిస్, సెకీ కంపెనీలతో ప్రభుత్వం కుదుర్చుకున్న విద్యుత్తు ఒప్పందాలను వెంటనే రద్దు చేయాలని కార్మిక నాయకుడు రామ్మూర్తినాయుడు డిమాండ్ చేశారు. రాజాంలో ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లు, ట్రూఅప్, సర్ ఛార్జీలను కూడా రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాడ్ చేశారు. యూనిట్ ధర రూ.4.60 వంతున కొనుగోలు చేసేలా ఒప్పందం చేసుకోవడంతో ప్రజలపై భారం పడుతోందని అన్నారు. కార్యక్రమంలో పలువురు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ



నూకాలమ్మ

వేపాడ, మే 11 (ఆంధ్రజ్యోతి): కుమ్మపల్లి గ్రామంలో నిర్మించిన నుకాలమ్మతల్లి ఆలయంలో ఆదివారం విగ్రహ ప్రతిష్ఠ చేశారు. గడిచిన మూడు రోజులుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అన్నసమారాధన, సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. వేదపండితుడు శ్రీనివాసరావుశర్మ ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేశారు.

167 మందికి ఉచిత వైద్య సేవలు

జామి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం స్థానిక సత్యసాయి భజన మండలి, రెడ్‌క్రాస్ సంయుక్తంగా వైద్యశిబిరం ఏర్పాటు చేశాయి. ఈ శిబిరంలో 167మందికి వైద్యపరీక్షలు నిర్వహించారు. వీరికి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

రాజాం, మే 11 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు యడ్ల నీరజారాణి ఎస్ఎస్‌సి గర్ల్స్ అవార్డులను ఆదివారం పద్మశ్రీ అవార్డు గ్రహీత యడ్ల గోపాలరావు అందజేశారు. గొర్లె నేహకు రూ.25వేలు, పల్ల మాధవికి రూ 15వేల నగదును అందజేశారు. ఈ కార్యక్రమంలో సామంతుల బంగారునాయుడు, వైద్యులు సామంతుల కిరణ్, యడ్ల నీరజారాణి తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



రేగిడి: దేవుదళలో కలుసుకున్న పూర్వ విద్యార్థులు



రాజాం: విశ్రాంత ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

రేగిడి, మే 11, (ఆంధ్రజ్యోతి): దేవుదళ హైస్కూల్‌లో 1998-2003 విద్యా సంవత్సరంలో చదువుకున్న 105 మంది పూర్వవిద్యార్థులు ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశారు. ఈ పాఠశాలలో 6 నుంచి పదోత తరగతి వరకు వీరంతా చదువుకున్నారు. ప్రస్తుతం వీరంతా వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. అప్పట్లో చదువు చెప్పిన గురువులు కెంబూరు అప్పలనాయుడు, కెంబూరు రామినాయుడు, మల్లేశ్వరరావు, ముడిదాన అనందరావు, గారాల సూర్యం, జడ్డు హైమావతి, పి.ఆదిలక్ష్మిలను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముళ్ల శ్రీనివాసరావు, కెంబూరు శ్రీనివాసరావు, కె.రాజేష్, ఎంఐసీ కో ఆర్డినేటర్ శ్రీనివాసరావు, సీఆర్పీలు చంద్రరావు, వెంకటరమణ, పూర్వ విద్యార్థులు కర్నేణ తవిటినాయుడు, లక్ష్మణశర్మ, ప్రసాద్‌రావు, బాబురావు, కె.ధనలక్ష్మి, వై.వాగ్దేవి తదితరులు పాల్గొన్నారు.

బొద్దాంలో...

రాజాం మే 11 (ఆంధ్రజ్యోతి): బొద్దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2001 -2002 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ కలయిక ఏర్పాటు చేశారు. వేర్వేరు ప్రాంతాల్లో స్థిరపడిన వీరు ఆనాటి గురువులను సత్కరించారు. సమారు 80 మంది కుటుంబ సమేతంగా కలిసి ఉదయం నుంచి సాయంత్రం వరకు సందడిగా గడిపారు. విశ్రాంత ఉపాధ్యాయులు వాండ్రంగి గౌరీశంకర్. గిరిజా కుమారిలను ఘనంగా సన్మానించారు.

కార్యకర్తలకు అండగా తెలుగుదేశం: మంత్రి



చెక్కు అందజేస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

గంట్యాడ, మే 11 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలకు అండగా తెలుగుదేశం పార్టీ ఉంటోందని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. రామవరం గ్రామంలో మృతి చెందిన పి.వాసు కుటుంబానికి తెలుగుదేశం పార్టీ తరఫున ప్రమాద బీమాగా రూ.5 లక్షల చెక్కును ఆదివారం మధ్యాహ్నం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తల కుటుంబాల్లో మనోధైర్యం నింపడం కోసం ఇటువంటి సాయం అందిస్తున్నట్టు తెలిపారు. ప్రతి కార్యకర్తకు తెలుగుదేశం పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రైం న్యూస్

లారీ ఢీకొని యువకుడి మృతి



జానకిరాం (ఫైల్)

బొండపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెట్రోల్ బంకు సమీపాన జాతీయ రహదారిపై ఆదివారం బైకును లారీ ఢీకొన్న సంఘటనలో యువకుడు మృతిచెందాడు. స్థానిక ఎస్ఐ యు.మహేష్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మక్కువ గ్రామంలోని శ్రీదేవి కాలనీకి చెందిన తుమరాడ జానకిరాం అలియాస్ శ్రీను (22) విజయనగరం నుంచి స్వగ్రామం మక్కువ వైపు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా విజయనగరం నుంచి వస్తున్న లారీ వెనుకవైపు నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో జానకిరాం అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం విజయనగరం ఆసుపత్రికి తరలించారు. జానకిరాం వివాహాల్లో బ్యాండు వాయిస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని తండ్రి ఇటీవలే మృతిచెందాడు. ఒక్కగానొక్క కొడుకు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లి రవణమ్మ విలపిస్తున్న తీరు చూపరులకు కంటతడి పెట్టించింది.

బైక్ ఢీకొని వ్యక్తి మృతి

లక్కవరపుకోట (కొత్తవలస), మే 11 (ఆంధ్రజ్యోతి): దేవాడ గ్రామ సమీపంలో బైక్ ఢీకొట్టిన సంఘటనలో స్థానికుడు గాడి తాతబాబు (56) అనే వ్యక్తి మృతిచెందినట్టు కొత్తవలస సీఐ షణ్ముఖరావు తెలిపారు. మృతుడు తాతబాబు ఆదివారం రోడ్డు దాటుతుండగా అతివేగంగా బైక్ వచ్చి ఢీకొట్టినట్లు చెప్పారు. తీవ్రమైన గాయాలతో ఉన్న తాతబాబును చికిత్స కోసం కొత్తవలస తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు తెలిపారు. సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.

యువకుడి అదృశ్యం

సంతకవిటి, మే 11 (ఆంధ్రజ్యోతి):మిర్తివలస గ్రామానికి చెందిన కలిశెట్టి సురేష్ (20 అనే యువకుడు అదృశ్యమైనట్టు ఆదివారం స్థానిక పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. పోలీసుల కథనం మేరకు ఈ నెల 6న సాయంత్రం 5 గంటల నుంచి సురేష్ కనిపించడం లేదు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మందరాడలో సీసీ కెమెరాల ఏర్పాటు

సంతకవిటి, మే 11 (ఆంధ్రజ్యోతి): మందరాడ గ్రామంలో షాపులు పెట్టుకొని వ్యాపారం చేస్తున్న యజమానుల సాయంతో ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్టు ఎస్ఐ ఆర్. గోపాలరావు తెలిపారు. నేరాల నియంత్రణకు, కేసులు ఛేదించేందుకు ఈ సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని తెలిపారు. ప్రతి గ్రామంలో షాపుల యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఆయన సూచించారు.

నాగార్జునను కలిసిన శ్రీకాకుళం డీసీసీబీ చైర్మన్



నాగార్జునను సత్కరిస్తున్న సూర్యనారాయణ తదితరులు

చీపురుపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): విజయనగరం ఉమ్మడి జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చైర్మన్‌గా నియమితులైన కిమిడి నాగార్జునను శ్రీకాకుళం జిల్లా డీసీసీబీ చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ ఆదివారం చీపురుపల్లిలోని నాగార్జున నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేశారు. ఇరువురు పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం రెండు జిల్లాల్లో రాజకీయ పరిస్థితులపై మాట్లాడారు. వీరి వెంట కార్యకర్తలు ఉన్నారు.

అమరవీరుడు మురళీనాయక్‌కు ఘన నివాళి



మురళీనాయక్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జనసేన నాయకులు

చీపురుపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సిందూర్ పోరాటంలో అసువులు బాసిన మురళీనాయక్‌కు జనసేన నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో పార్టీ ఇన్‌చార్జి విసినిగిరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మురళీనాయక్ చిత్రపటానికి పూల మాలలు వేసి, నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తుల సమాచారం ఇవ్వండి



కొత్తవలస ఆర్టీసీ కాంప్లెక్స్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు



చీపురుపల్లి రైల్వే స్టేషన్‌లో..

లక్కవరపుకోట (కొత్తవలస), మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని... ఎవరిపైనైనా అనుమానం వస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కొత్తవలస సీఐ షణ్ముఖరావు తెలిపారు. ఆదివారం కొత్తవలస, కంటకాపల్లి రైల్వే స్టేషన్లు, స్థానిక బస్ స్టేషన్‌లో సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించారు. ప్రయాణికుల బ్యాగులను తనిఖీ చేశారు. కొత్త వ్యక్తులు, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే తెలపాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



గరివిడి రైల్వే స్టేషన్‌లో...

చీపురుపల్లిలో...

చీపురుపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): సరిహద్దులో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో పోలీసులు వివిధ ప్రాంతాల్లో ఆదివారం సోదాలు నిర్వహించారు. చీపురుపల్లి ఎస్ఐ ఎల్. దామోదరరావు నేతృత్వంలో పోలీస్ సిబ్బంది, రైల్వే స్టేషన్, బస్‌స్టాండ్ తదితర ప్రాంతాల్లో ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

గరివిడిలో...

గరివిడి, మే 11 (ఆంధ్రజ్యోతి): గరివిడి పట్టణంలో స్థానిక ఎస్ఐ లోకేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ప్రధాన రహదారిలోని బస్‌షెల్టర్, రైల్వే స్టేషన్ వద్ద ఈ తనిఖీలు చేపట్టారు.

కళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి:ఎంపీ కలిశెట్టి



మాట్లాడుతున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



కొత్త పరిమళం నాటికలోని ఓ సన్నివేశం

గరివిడి, మే 11 (ఆంధ్రజ్యోతి): కళారంగం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో కృషి చేస్తోందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తెలిపారు. గరివిడిలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటిక పోటీలలో చివరిరోజైన ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గరివిడి కల్చరల్ అసోషియేషన్ భవిష్యత్తులో ఎటువంటి కార్యక్రమాలు చేపట్టినా తనతో పాటు ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం అర్హులైన కళాకారులకు పింఛను సౌకర్యం కల్పిస్తోందన్నారు. అంతరించిపోతున్న నాటకాల విశిష్టతను యువతకు తెలియపరిచేందుకు గరివిడి కల్చరల్ అసోషియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఆదివారం రాత్రి కొత్త పరిమళం, చీకటిపువ్వు, సేవారాగం అనే నాటికలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి కె.త్రిమూర్తులురాజు, లోక్‌సత్తా పార్టీ జిల్లా అధ్యక్షుడు బీశెట్టి బాబ్జీ, నటి కవిత, వాకాడ గోపి, ఎం.జగన్నాథరాజు, చింతాడ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

కట్టు బానిసలుగా మార్చడానికే లేబర్ కోడ్స్



జీపు జాతాలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సురేష్

చీపురుపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): కార్మికులను కట్టు బానిసలుగా మార్చడానికే కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్స్ ప్రవేశ పెడుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.సురేష్ ఆరోపించారు. చీపురుపల్లిలోని మూడు రోడ్ల కూడలిలో ఆదివారం సాయంత్రం టీవీ రమణ అధ్యక్షతన జరిగిన జీపు జాతాలో ఆయన మాట్లాడారు. కార్మిక చట్టాలను రద్దు చేసి, వాటి స్థానంలో లేబర్ కోడ్స్ తేవడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. ఈ ప్రయత్నాలను తిప్పి కొట్టేందుకు దేశ వ్యాప్తంగా ఈ నెల 20న జరిగే సమ్మెలో ప్రతి కార్మికుడు పాల్గొనాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి జగన్మోహనరావు మాట్లాడుతూ అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు, మిడ్ డే మీల్, వీఓఏ ఇతర వర్గాలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యుడు ఎ.సురేష్, గౌరి పాల్గొన్నారు.

అమ్మ ప్రేమ అమూల్యమైనది



తల్లులను సత్కరిస్తున్న దృశ్యం

విజయనగరం దాసన్నపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): అమ్మ ప్రేమ శాశ్వతమని... అది అమూల్యమైనదని మనం జీవించినంత కాలం తల్లిని ప్రేమించాలని జనవిజ్ఞాన వేదిక సమతా రాష్ట్ర కన్వీనరు జి.నిర్మల అన్నారు. ఆదివారం సుంకరవీధిలో అమ్మకు వందనం కార్యక్రమాన్ని నిర్వహి ంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నేటి సమాజంలో తల్లులని గౌరవంగా ఎలా చూడాలన్నది పిల్లలకు నేర్పాలన్నారు మూఢ నమ్మకాలు వదలి శాస్త్రీయ విజ్ఞానంతో పురోగతి సాధించాలని అన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు తల్లులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది రమేష్ రాజా, శశికళ, శాంతి తదితరులు పాల్గొన్నారు.

ఖండ్యాం రోడ్డులో ట్రాఫిక్ కష్టాలు

రేగిడి, మే 11 (ఆంధ్రజ్యోతి): ఖండ్యాం-జావాం మీదుగా నారాయణపురం వెళ్లే వరదకట్ట రోడ్డులో ప్రయాణికులు అవస్థలకు గురవుతున్నారు. దాదాపు 5 కిలోమీటర్లు పొడువన నాగావళి నదికి రక్షణగా వేసిన వరదగట్టు కావటంతో అత్యంత ఇరుగ్గా ఉంది. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ మార్గం 20 గ్రామాల వారితో పాటు ఇటు సంతకవిటి, రేగిడి, బూర్జ మండలాలతో పాటు శ్రీకాకుళం వెళ్లేందుకు అత్యంత దగ్గరి దారి. ఆదివారం ఈ ప్రాంతంలోని కొన్ని గ్రామాల్లో శుభకార్యాలు ఉండడంతో వాహనాల రద్దీతో ట్రాఫిక్ జాం ఏర్పడింది. తరచూ ఇలాంటి సమస్యలే తలెత్తుతున్నాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని రహదారిని విస్తరించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

భారత సైనికుల కోసం పూజలు



పైడిమాంబ ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ తదితరులు

విజయనగరం దాసన్నపేట, మే 11 (ఆంధ్రజ్యోతి): భారత సైనికుల శక్తి సామర్థ్యాలు పెరగాలని ...మనకు విజయం చేకూర్చాలని కోరుతూ బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాజేష్‌వర్మ ఆధ్వర్యంలో నగరంలోని పైడిమాంబ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం ప్రగతి సాధించాలని కోరుతూ ఆలయం ఎదుట 108 కొబ్బరికాయలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతో భారత సైనికులు, ప్రజలు, సుఖ శాంతులతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు లక్ష్మీనరసింహం, సుధీర్, రాంబాబు, గిరిబాబు, రమణ, గోపాల్‌రెడ్డి, జగ్గారావు పాల్గొన్నారు.

నాటుసారా నిర్మూలనపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న ఎక్సైజ్ ఎస్ఐ నాగేశ్వరరావు

నెల్లిమర్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): నాటుసారా నిర్మూలనపై అవగాహన అవసరమని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. నెల్లిమర్ల ఎక్సైజ్ పోలీసుల ఆధ్వర్యంలో గుర్ల మండలం దేవుని కణపాకలో ఆదివారం నాటుసారా నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ సూర్యనారాయణరాజు సమక్షంలో ఎక్సైజ్ సీఐ ఎం.వెంకటరావు, ఎస్ఐలు ఎం.నాగేశ్వరరావు, యు.నాగేశ్వరరావు తదితరులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సారా తయారీ, అమ్మకాల వల్ల కలిగే అనర్థాలు, శిక్షలపై అవగాహన కల్పించారు.

నేటి నుంచి రామాలయం ప్రారంభోత్సవాలు

వీరఘట్టం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిట్టిడివలస గ్రామంలో కోదండ రామాలయం ప్రారంభోత్సవాన్ని సోమవారం నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు ఆదివారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాల ప్రజలు హాజరుకావాలని కోరారు.

కలపపై కన్నేశారు

(ఐదో పేజీ తరువాయి)

రైస్‌మిల్లులు కొన్ని కలప కోత యంత్రాలతో టింబర్ డిపోలుగా మారిపోయాయి. ఇదో లాభసాటి వ్యాపారం కావడంతో సంబంధిత నిర్వాహకులు మార్పులు చేసుకుంటున్నారు. అయితే టింబర్ డిపోలకు వస్తున్న కలప కొంతవరకూ మాత్రమే సక్రమం. మిగతాది అక్రమంగా వస్తున్నదే. ప్రధానంగా కలప రవాణా వేకువజామున జరుగుతుంది. అటవీ శాఖ సిబ్బందితో ముందస్తు ఒప్పందం జరిగి నా.. పోలీసులతో ఇబ్బందులు తప్పవు. అందు కే తెల్లవారుజాము 3, 4 గంటల నుంచి 7 గంటల్లోగానే ఈ కలప అక్రమ రవాణా పూర్తి చేస్తున్నట్లు సమాచారం.

నీలగిరి మాయం

జిల్లాలో చాలా ప్రాంతాల్లో నీలగిరి సాగు అధికం. మరోవైపు జిల్లాలో గిరిజనులు, అడవులకు అనుబంధంగా ఉన్న ప్రాంతాల నుంచి కూడా అరుదైన కలప తరలిపోతోంది. ఒడిశా దగ్గరగా ఉండడంతో అటు వైపుగా ఎక్కువగా తరలిస్తున్నారు. వాటి కోసం గిరిజనులను సమిధులుగా మార్చి మైదాన ప్రాంతాలకు తెస్తున్నారు. అక్కడ నుంచి లారీలు, కంటైనర్లలో ఇతర ప్రాంతాలకు తరలించి దళారులు సొమ్ము చేసుకుంటు న్నారు. దళారులు, వ్యాపారులు కాళ్ల కదప కుండా లక్షల రూపాయలు ఆర్జిస్తున్నారు. అయితే ఇంత జరుగుతున్నా అటవీ శాఖకు కనిపించకపోవడం విమర్శలకు దారితీస్తోంది. జిల్లాలో పూసపాటిరేగ, భోగాపురం మండలా ల్లో 29 కిలోమీటర్ల మేర తీర ప్రాంతం ఉంది. తీర ప్రాంతం నుంచి నీలగిరి, సరుగుడు పెద్ద ఎత్తున తరలిపోతోంది. ఇవి తీరానికి రక్షణ కవచంలా ఉంటాయి. తీరం కోతకు గురికా కుండా కాపాడతాయి. విపత్తులు వచ్చినప్పు డు అడ్డంగా నిలుస్తాయి. వాటిపై సైతం అక్రమార్కుల కన్నుపడింది. యథేచ్ఛగా నరికివేసి తరలించి సొమ్ము చేసుకుంటున్నా రు. ఇప్పటికైనా అటవీశాఖ కలప అక్రమ రవాణాపై దృష్టిపెట్టాల్సిన అవసరముంది.

నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

(ఐదో పేజీ తరువాయి)

కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ జరగకుండా చర్యలు తీసుకున్నారు. ప్రతి కేంద్రానికి సూపరింటెండెంట్‌తో పాటు డిపార్టుమెంట్ అధికారులను నియమించారు. 560 మంది ఇన్విజిలేటర్లు, ఐదు స్క్వాడ్ బృందాలను నియమించారు. విద్యార్థులు పరీక్ష సమయం కంటే అరగంట ముందు కేంద్రానికి చేరుకోవాల్సి ఉంది. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలు కానుంది. వైద్య సిబ్బంది అందుబాటులో ఉంటారు.

ప్రాథమిక విద్యను పటిష్ఠం చేయాలి



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు

బొబ్బిలి రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక విద్యను పటిష్ఠం చేయాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఏపీటీఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఆరు పాఠశాలల పద్ధతిని ప్రవేశపెడితే ప్రస్తుత ప్రభుత్వం తొమ్మిది రకాల పాఠశాలల అమలుకు సన్నాహాలు చేస్తుందన్నారు. ఇలాంటి ప్రయోగాల వల్ల తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర గందరగోళంలో ఉన్నారన్నారు. అనంతరం జిల్లా నాయకుడు జోగినాయుడు మాట్లాడుతూ 12వ పీఆర్సీ, మధ్యంతర భృతి ప్రకటించాలని, కరువు భత్యం, 11వ పీఆర్సీ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రమేష్, నాగేశ్వరరావు, దర్శనం, చిన్నారావు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు



ముత్తాయవలస వెళ్లే రోడ్డులో నిలిచిన నీరు

బొబ్బిలి రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): ముత్తాయవలస గ్రామానికి వెళ్లే రహదారి అధ్వానంగా తయారయ్యింది. ఈ రహదారిలోని తోటపల్లి కుడికాలువపై ఉన్న వంతెనకు ఇరువైపులా వర్షం నీరు నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. బస్టాప్‌కు సమీపంలో ఉన్న ఆ వంతెనకు ఇరువైపులా ఉన్న రోడ్డు ఎత్తు తక్కువగా ఉండటం వల్ల, ఏమాత్రం వర్షం పడినా నీరు నిలిచిపోతుంది. దీంతో రాకపోకలకు వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రహదారి గుండా కలవరాయి, శివడవలస, పిరిడి తదితర గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. సంబంధిత అధికారులు ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

నాడు అలా.. నేడు ఇలా..

- పునరావాస ప్రాంత రహదారికి మోక్షం



గతంలో పిన్నింటిరామినాయుడువలసకు వెళ్లే రహదారి దుస్థితి

గరుగుబిల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): తోటపల్లి ప్రాజెక్టు పరిధిలోని పునరావాస గ్రామమైన పిన్నింటిరామినాయుడువలసకు వెళ్లే రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగింది. గతంలో ఈ గ్రామానికి వెళ్లాలంటే ప్రజలు నరకం చూసేవారు. అయితే గత సార్వత్రిక ఎన్నికల సమయంలో ఓట్లు లెక్కింపునకు ఉల్లిభద్ర ఉద్యాన వన కళాశాలలో కేంద్రాలను అప్పట్లో అధికారులు తాత్కాలిక రహదారిని ఏర్పాటు చేశారు. ఆ తర్వాత వర్షాలకు అధికంగా కోతకు గురైంది. పిన్నింటిరామినాయుడువలస నుంచి ఉల్లిభద్ర వరకు నిర్మించిన రహదారికి సుమారు రూ.6లక్షలు ఉపాధి నిధులు వెచ్చించారు. నెలల సమయంలోనే కోతకు గురైన పరిస్థితిపై కథనం వెలువడింది. వర్షాల సమయంలో పునరావాస గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ప్రధాన రహదారి నుంచి గ్రామం వరకు బీటీ రహదారి నిర్మాణానికి సుమారు రూ.75 లక్షలతో బీటీ రహదారి నిర్మాణానికి ఉపాధి నిధులు వెచ్చించారు. ఈ నిధులతో బీటీ రహదారితో పాటు ప్రధాన కల్వర్టు పనులు పూర్తికావచ్చాయి.



ప్రస్తుతం రహదారి పనులు పూర్తికావచ్చిన దృశ్యం

సైనికుల క్షేమాన్ని కోరుతూ..

- ఆలయాల్లో ప్రత్యేక పూజలు
- ఆపరేషన్ సిందూర్‌కు మద్దతుగా ర్యాలీలు



పాలకొండ: అరసవల్లిలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే జయకృష్ణ, జనసేన నాయకులు



పార్వతీపురంటౌన్: ర్యాలీ చేస్తున్న వాకర్స్ క్లబ్ సభ్యులు

పాలకొండ, మే 11 (ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు ఆపరేషన్ సిందూర్‌లో భారత సైనికుల క్షేమాన్ని కోరుతూ శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని అరసవల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, జనసేన పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్, తూర్పుకాపు కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్ పాలవలస యశస్వి, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్, జిల్లా ఉపాధ్యక్షుడు గర్భాన సత్తిబాబు పాల్గొన్నారు. జనసేన పార్టీ అసెంబ్లీ నియోజకవర్గాల సమన్వ యకర్తలు డా.విశ్వక్సేన్, దాసరిరాజు, కె. కిరణ్‌కుమార్, గేదెల చైతన్య, పొగిరి సురేష్‌కుమార్, బలగ ప్రవీణ్, నిమ్మల నిబ్రం, జనసేన పార్టీ ఇల్లా ఉపాధ్యక్షులు భూపతి అర్జున్, జిల్లా ప్రధాన కార్యదర్శులు డాక్టర్ దానేటి శ్రీధర్, సంతోష్ పండా, జిల్లా కార్యదర్శులు వడ్డాది శ్రీనివాస్, తాళాబత్తుల పైడి రాజు, బొంతు విజయకృష్ణ, జిల్లా సంయుక్త కార్యదర్శులు కీర్తి సుశీల, హరిబాబు, వారాది వరలక్ష్మీ, చిట్టి భాస్కర్ పాల్గొన్నారు.



బొబ్బిలి రూరల్: వీర జవాన్‌కు నివాళి అర్పిస్తున్న ముస్లింలు

- బొబ్బిలి రూరల్: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావాలని కోరుతూ బొబ్బిలి పట్టణంలోని ముస్లింల ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక జామియా మసీద్ నుంచి పాత కోటలో గల మాజీ సైనిక సంక్షేమ సంఘం కార్యాలయం వరకు ర్యాలీ చేశారు. అక్కడ మాజీ సైనికులను సత్కరించారు. అనంతరం యుద్ధంలో అసువులు బాసిన వీర జవాన్ మురళీ నాయక్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులు అర్పించారు. మాజీ సైనిక సంఘం గౌరవ అధ్యక్షుడు మరడ రామినాయుడు, అధ్యక్షుడు రెవళ్ల కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు రెడ్డి రామకృష్ణ, కార్యదర్శి అలుగోలు గోవందనాయుడు, వాయుసేన అధికారి శ్రీనివాసరావు, ముస్లిం సంఘం పెద్దలు పాల్గొన్నారు.
- పార్వతీపురంటౌన్: ఆపరేషన్ సిందూర్‌లో వీర మరణం పొందిన మురళీనాయక్, సచిన్‌యాదవ్‌రావులకు మార్నింగ్ స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులు ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో నివాళి అర్పించారు. అనంతరం జవానులకు మద్దతుగా ర్యాలీ నిర్వహించారు. క్లబ్ ఉపాధ్యక్ష, కార్యదర్శులు ఎం.శ్రీనివాసరావు, మహిపతి పాల్గొన్నారు.

ప్రగతి పట్టాలెక్కేనా?

(ఐదో పేజీ తరువాయి)

మూతపడింది. భీమసింగి కర్మాగారం ఆధునీకరణ పేరుతో నిలిపివేసి ఏళ్లు గడుస్తోంది. వీటిలో పనిచేసే 12 వేల మంది కార్మికులు వీధినపడ్డారు. సంతకవిటిలో ఉన్న చెరకు పరిశ్రమ కూడా ముందుకు సాగడం లేదు. చెరకు సాగు తగ్గి లక్షలాది మంది రైతులకు పంట గిట్టుబాటు కావడం లేదు.

పూర్తిస్థాయిలో మెరుగుపడని రోడ్లు..

కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత రోడ్లు కొంత మెరుగుపడ్డాయి. ఇంకా మెరుగుపడాల్సి ఉంది. జిల్లాలో తగరపువలస-విజయనగరం-రాజాం రహదారి ప్రధానమైనది. గత ఐదేళ్లలో కనీస నిర్వహణ లేక దారుణంగా మారింది. దీనిని పీపీపీ పద్ధతిలో పూర్తిచేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అదే సమయంలో విజయనగరం-పార్వతీపురం, చిలకపాలెం-పార్వతీపురం రోడ్లు సైతం దారుణంగా మారాయి. వాటిని సైతం పూర్తిచేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. చీపురుపల్లి రైల్వేవంతెన, పారాది వంతెన, సీతానగరం వంతెనలను పూర్తిచేయాల్సిన అవసరం ప్రభుత్వంపై ఉంది. నగరంలోని ఎత్తుబ్రిడ్జి వద్ద ట్రాఫిక్ ఎక్కువగా ఉంటోంది. ఇక్కడ సబ్ వే నిర్మాణం జరుగుతుందని, గతంలో ప్రణాళికలు తయారు చేశారు కాని కార్యరూపం దాల్చలేదు. పట్టణంలోని జమ్మునారాయణపురం నుంచి డెంకాడ మండలం నాతవలస వరకూ రహదారి విస్తరిస్తే భోగాపురం ఎయిర్‌పోర్టుకు చాలా ఉపయోగపడుతుంది.

గిరిజన యూనివర్సిటీ ఎప్పుడో?

గిరిజన యూనివర్సిటీ అనేది పుష్కరకాలంగా నిర్మించలేకపోవడం జిల్లా ప్రజల దురదృష్టకరం. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా అప్పట్లో గిరిజన యూనివర్సిటీని కేటాయించారు. తొలుత శృంగవరపుకోట నియోజకవర్గంలోని రెల్లిలో స్థల ఎంపికను పూర్తిచేశారు. 500 ఎకరాల్లో యూనివర్సిటీ ఏర్పాటుకు 2014లోనే సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. అయితే వైసీపీ ప్రభుత్వం యూనివర్సిటీని దత్తిరాజేరు-మెంటాడ మండలాల్లోని సరిహద్దు ప్రాంతాలకు మార్చింది. టీడీపీ ప్రభుత్వం ఎంపికచేసిన స్థలంలోనే పనులు పూర్తిచేసి ఉంటే కొత్త భవనాలు అందుబాటులోకి వచ్చేవి. ప్రస్తుతం 519 ఎకరాల్లో పనులు మళ్లీ ప్రారంభించారు. ఇక్కడే కొనసాగించేందుకు కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. వీటి పనులు శరవేగంగా జరిపించాల్సిన అవసరం రాష్ట్ర ప్రభుత్వంపై ఉంది. దీనిపై సమావేశంలో నేతలు చర్చించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

విద్య, వైద్యరంగాల్లోనూ వెనుకబాటు

విద్య, వైద్యరంగం అభివృద్ధి చెందితేనే ఆశించిన ఫలాలు దక్కుతాయి. ముఖ్యంగా ప్రభుత్వ వైద్య కాలేజీ నిర్మాణం నత్తనడకగా సాగుతోంది. దీనివల్ల జీజీహెచ్‌కు రోగుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో సపోర్టు స్టాఫ్ లేకపోవడంతో ఇబ్బంది ఏర్పడుతోంది. ఇక్కడ గ్యాస్ట్రాలజీ నిపుణులు లేక రోగులు ప్రైవేటు ఆసుపత్రికి వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. మరోవైపు విద్యాపరంగా మరింత వసతులు మెరుగుపడాలి. జిల్లా కేంద్రంలో జెఎన్‌టీయూలో అనేక సమస్యలు ఉన్నాయి. ఇదిలా ఉంటే వైసీపీ హయాంలో పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులు పూర్తిస్థాయిలో జరగలేదు.

అధికంగా రెవెన్యూ సమస్యలు

జిల్లాలో భూ సమస్యలు అధికంగా ఉన్నాయి. ఈ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత గత ఏడాది నవంబరు 30న జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆధ్యక్షతన నిర్వహించిన డీఆర్‌సీలో వివిధ భూ సమస్యలను ప్రస్తావించారు. ఫ్రీహోల్డ్ పట్టాలకు సంబంధించి సుమారు 490 ఎకరాల వరకూ అవకతవకలు జరిగినట్లు తేలిందని, బాధ్యులైన రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని అప్పట్లో అమె వెల్లడించారు. ఇప్పటివరకూ దీనిపై ఎటువంటి కదలిక లేదు. వెబ్‌ల్యాండ్‌లో రైతులు పేర్లు మారిపోవడంతో రైతులు అందోళన చెందుతున్నారు. ప్రతి తహసీల్దార్ కార్యాలయాల్లో కంప్యూటర్ ఆపరేటర్లు ఆన్‌లైన్‌లో పేర్ల మార్పుల్లో కీలక పాత్ర పోషిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తహసీల్దార్లకు చెందిన డిజిటల్ సిగ్నేచర్ కీ వీరి వద్ద ఉండటంతో ఇటువంటి సంఘటలు చోటు చేసుకుంటున్నాయని రైతులు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. కాగా భూముల రీ సర్వేకు సంబంధించి రోవర్ల సమస్య చాలా ఎక్కువగా ఉంది. గత వైసీపీ హయంలో జిల్లాకు 202 రోవర్లు కేటాయించారు. వీటిలో 60రోవర్లు పనిచేయడం లేదు. పూర్తిస్థాయిలో రోవర్లు లేక గ్రామ సర్వేయర్లు ఇబ్బంది పడుతున్నారు. ఈ దిశగా జిల్లా ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సాగునీటి ప్రాజెక్టులదీ అదే తీరు..

సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేయడానికి ఇదే మంచి సమయం. ఉమ్మడి విజయనగరం జిల్లాలో తోటపల్లి ప్రాజెక్టు అత్యంత కీలకమైనది. 19,85,221 ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాలన్న లక్ష్యంతో ప్రారంభంలో రూ.1127.58 కోట్లతో పాలనా అనుమతి లభించింది. ఇప్పటివరకూ రూ.900 కోట్ల వరకూ వెచ్చించినట్టు గణాంకాలు చెబుతున్నాయి. అయినా ఏటా ఖరీఫ్‌లో 80 వేల ఎకరాల ఆయకట్టుకు కూడా సాగునీరు అందించడం గగనంగా మారింది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో బడ్జెట్ కేటాయింపులు రూ.655.19 కోట్లు చేసినా.. ప్రభుత్వం కేవలం రూ.61.82 కోట్లు మాత్రమే విడుదల చేయగలిగింది. కనీసం ఏడాదికి రూ.100 కోట్లు బడ్జెట్ నిధులు విడుదల చేసినా.. ప్రధాన పనులు పూర్తిచేసేవారమని యంత్రాంగం చెబుతోంది. చివరకు కాంట్రాక్టర్‌కు సైతం రూ.6 కోట్ల బిల్లులు చెల్లించాల్సి ఉంది.

కదలిక లేని తారకరామతీర్థ సాగర్

తారకరామ తీర్థసాగర్ ప్రాజెక్టుదీ దయనీయ పరిస్థితే. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఇంకా కాంట్రాక్టర్‌కు రూ.18 కోట్లు వరకూ బకాయిలు పెట్టినట్టు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టుకు రూ.739 కోట్లకు సంబంధించి పాలనా ఆమోదం లభించింది. ఇప్పటివరకూ రూ.310 కోట్ల వరకూ పనులు మాత్రమే జరిగినట్టు తెలుస్తోంది. రూ.429 కోట్ల వరకూ పనులు చేయాల్సి ఉంది. కనీసం వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏడాదికి రూ.100 కోట్లు విడుదల చేసినా పెండింగ్ పనులు పూర్తయ్యేవి. అధికారులు చేసిన ప్రతిపాదనలను జగన్ సర్కారు బుట్టదాఖలు చేసింది. మరోవైపు నిర్వాసితుల సమస్యకు పరిష్కారం చూపలేకపోయింది. 300 ఎకరాల వరకూ భూసేకరణ చేయాల్సి ఉన్నా. దాని జోలికి పోలేదు.

అభివృద్ధిని అడ్డుకునేందుకు పన్నాగాలు

గరుగుబిల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అభివృద్ధిని అడ్డుకునేందుకు వైసీపీ పన్నాగాలు చేస్తోందని టీడీపీ అరకు పార్లమెంట్ బీసీ సెల్ చైర్మన్ బూరాడ రామ్‌మోహనరావు విమర్శించారు. ఆదివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ఉచిత కుట్టు శిక్షణ నిర్వహిస్తోందని తెలిపారు. అయితే కుట్టు మిషన్ల పంపిణీలో కుంభకోణం జరిగిందంటూ పత్రికల్లో తప్పుడు ప్రచారం చేస్తూ వైసీపీ నాయకులు రోడ్డెక్కుతున్నారన్నారు. స్కాముల్లో కూరుకుపోయిన జగన్‌రెడ్డికి ప్రస్తుతం అన్ని పథకాలు స్కాములుగా కనిపిస్తున్నాయని ఆయన విమర్శించారు.

50 శాతం రాయితీపై పశువుల దాణా



పశు దాణాను లారీ నుంచి దించుతున్న దృశ్యం

రామభద్రపురం, మే 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పాడి రైతులకు 50 శాతం రాయితీతో పశువుల దాణా పంపిణీ చేస్తోందని స్థానిక పశువైద్యాధికారిణి హిరణ్య తెలిపారు. ఈసందర్భంగా ఆమె ఆదివారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. దాణా కోసం రైతులు భారత పశుదాణా యాప్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే తెల్ల రేషన్‌కార్డు కలిగి ఉండాలన్నారు. 50 కేజీల పరిమాణం ఉన్న దాణా ఖరీదు రూ.1110 కాగా, సబ్సిడీ పోగా కేవలం రూ.555లు చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. ప్రతి రైతుకు 3 నెలలకు 450 కేజీల దాణా పంపిణీ చేస్తామన్నారు. ఈ సమీకృత దాణా పిల్లెట్స్‌లో పోషక విలువలతో కూడిన విటమిన్లు, ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయని, అత్యధిక పాల దిగుబడికి ఇది ఎంతగానో ఉపకరిస్తుందని ఆమె వివరించారు. రైతులు పశువుల ఆసుపత్రుల్లో సంప్రదించి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు.

ఘనంగా శివుని విగ్రహ ప్రతిష్ఠ

బొబ్బిలి రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): బొబ్బిలి మండలంలోని కింతలివానిపేట గ్రామంలో కోనేరు మధ్యలో నూతనంగా శివుని విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన పాల్గొని, పూజలు చేశారు. అలాగే అక్కడి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయాలి

బొబ్బిలి రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పట్టణ కళాసీ సంఘం, ఐఎఫ్‌టీయూ, సీఐటీయూ సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు ఆదివారం బొబ్బిలి పనివాళ్ల సంఘం కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కళాసీ సంఘం కార్యదర్శి ఎ.అప్పారావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు మాట్లాడుతూ స్థానిక వేణు గోపాలస్వామి కోవెల సెంటర్‌లో జరిగే ప్రదర్శనలో కార్మికులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొనాలని కోరారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.గోపాలం, పిల్ల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

26న మహాధర్నా



పూర్ణపాడు-లాబేసు వంతెనను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

జియ్యమ్మవలస, మే 11 (ఆంధ్రజ్యోతి): కొమరాడ మండలం పూర్ణపాడు - లాబేసు వంతెన నిర్మాణాన్ని పూర్తి చేయాలంటూ ఈ నెల 26న మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మహాధర్నా చేయనున్నట్లు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు కొల్లి సాంబమూర్తి ప్రకటించారు. ఆదివారం ఆయన సీపీఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడుతో కలిసి పూర్ణపాడు - లాబేసు వంతెనను పరిశీలించారు. కార్యసాధనకు పోరాటమే శరణ్యమని, దీనికి అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

సీతంపేట రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి): సీతంపేట గ్రామంలోని దోనుబాయి కూడలిలో స్థానిక ఎస్ఐ వై.అమ్మన్నరావు ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం వాహన తనిఖీలు చేపట్టారు. పాలకొండ-హడ్డుబంగి రహదారిపై ప్రయాణించే ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ తనిఖీల్లో ఎస్ఐ తోపాటు ఏఎస్ఐ సంజీవరావు సిబ్బంది ఉన్నారు.

నేడు ఐటీడీఏలో పీజీఆర్ఎస్

సీతంపేట రూరల్, మే 11(ఆంధ్రజ్యోతి): స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఇన్‌చార్జి పీవో సి.యశ్వంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతివారం మాదిరిగానే సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహిస్తున్నట్టు ఐటీడీఏ అధికారులు తెలిపారు. ఈమేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమస్యల పరిష్కారం కోసం ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులు పీజీఆర్ఎస్‌ను ఆశ్రయించవొచ్చునని అన్నారు. పీజీఆర్ఎస్‌లో పీవోతో పాటు పలు శాఖలకు చెందిన అధికారులు అందుబాటులో ఉంటారని ఆయన తెలిపారు.

ఆకట్టుకున్న మాతృమూర్తి చిత్రం



పరిశినాయుడు గోటితో గీసిన చిత్రం

గరుగుబిల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): నాగూరు గ్రామానికి చెందిన ప్రముఖ నఖ చిత్రకారుడు పల్ల పరిశినాయుడు నఖంతో చిత్రీకరించిన మాతృమూర్తి చిత్రం పలువురిని ఆకట్టుకుంది. ఆదివారం మాతృ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్రీకరించిన ఈ చిత్రం ఎంతగానో ఆకట్టుకుంది.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

సాలూరు, మే 11(ఆంధ్రజ్యోతి): సాలూరులోని తన స్వగృహంలో మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును పంపిణీ చేశారు. పట్టణంలోని నాయుడువీధికి చెందిన మామిడి గౌరీశంకర్‌కు మంజూరైన రూ.66వేల 538ల చెక్కును ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, హర్షవర్ధన్, కూనిశెట్టి భీమారావు, నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.